

మదనపల్లెలో ఎసిబి సోదాలు



శ్రీకాంత్ ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్న ఎసిబి అధికారులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: మదనపల్లెలో శుక్రవారం ఎసిబి అధికారులు సోదాలు నిర్వహించారు. కర్నూలు జాయింట్ కమీషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసులో ఎఒగా పనిచేస్తున్న మూడే బాలు నాయక్ ఆదాయానికి మించి ఆస్థులు కలిగి ఉన్నాడన్న కేసులో పట్టుబడ్డాడు. ఎసిబి అడిషనల్ ఎస్‌పి విజయకుమారి ఆదేశాల మేరకు మదనపల్లె కురవంకలోని రవీంద్రనగర్‌లో ఉన్న బాలునాయక్ కుమారుడు శ్రీకాంత్ నాయక్ ఇంట్లో అదేవిధంగా రామారావు కాలనీలో ఉన్న వియ్యంకుడు వాలేనాయక్ ఇంట్లో ఎసిబి సిఐ హమీద్ ఖాన్ సిబ్బంది సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మదనపల్లెలో రెండు చోట్ల, రాయచోటి, తిరుపతి, కర్నూల్ ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టామన్నారు. మదనపల్లెలో మాకు లభించిన కొన్ని కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తుది వివరాలను ఉన్నతస్థాయి అధికారులు వెల్లడిస్తారని తెలిపారు.

సా..గుతున్న.. ఖరీఫ్!

- కెసి ఆయకట్టుపైనే ఆశలు
- కడపలో 21.33, అన్నమయ్యలో 13.63 శాతంలోనే విత్తనం

ఖరీఫ్ సీజన్ మందగమనంలో సా..గుతోంది. ఈ ఏడాది జూన్ ప్రారంభానికి ముందే రుతుపవనాలు వచ్చినట్లే వచ్చి మాయం కావడం వంటి అనిశ్చితి పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా రైతాంగం నిరుత్సాహానికి గురైంది. ఈ నెల మూడవ వారం నడుస్తున్నప్పటికీ సాగు ఆశించిన రీతిలో ఊపందుకోలేదు. ఖరీఫ్ సీజన్ లక్ష్యాన్ని చేరుకోవడం గగనంగా మారింది. నాలుగు రోజుల కిందట బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావం కారణంగా కురుస్తున్న వర్షాల కారణంగా ఆశించిన వర్షపాతం కురుస్తుందనే ఆశా భావం సన్నగిల్లింది. కడప జిల్లాలో 21.33 శాతం, అన్నమయ్యలో 13.63 శాతం విస్తీర్ణంలోనే విత్తనం పడిన నేపథ్యంలో ఆందోళన నెలకొంది.



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఖరీఫ్ సీజన్ నత్తనకడన సాగుతోంది. ఉభయ జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరి స్థితులు నెలకొనడం సాగు లక్ష్యాన్ని ప్రశ్నార్థకం చేస్తోంది. కడప జిల్లాలో 1,91,363 ఎకరాలు, అన్నమయ్య జిల్లాలో 1,40,797 ఎకరాల సాధారణ విస్తీర్ణంలో పంటలను సాగు చేయాలని వ్యవసాయశాఖలు లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే. ఉభయ జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కడప జిల్లాలో 40,284 ఎకరాల్లోనే విత్తనం పడింది. అన్నమయ్య జిల్లాలో 19,193 ఎకరాల్లోనే విత్తనం పడింది. గతేడాది కడప జిల్లాలో 45 వేలకుపైగా ఎకరాల్లో, అన్నమయ్య జిల్లాలో సుమారు 10 వేల ఎకరాల్లో విత్తనం పడింది. ఈలెక్కన కడప జిల్లాలో 21.33 శాతం, అన్నమయ్య జిల్లాల్లో 13.63 శాతం విస్తీర్ణంలోనే విత్తనం పడింది. ఉభయ జిల్లాల్లో మిగిలిన 79 నుంచి 96 శాతం పొలమంతా బీళ్లుగా దర్శనమిస్తోంది. ఈ ఏడాది ఉభయ జిల్లాల రైతాంగం సిద్ధమైన తరుణంలో మేఘం ముఖం చాటేసింది. ఫలితంగా ఖరీఫ్ సాగు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. కడప జిల్లాలో వరి సాగు 76,085 ఎకరాలకు గానూ 17,576 ఎకరాలు, వేరుశనగ 6,165 ఎకరాల్లో సాగుకు 2,465 ఎకరాల్లో మాత్రమే సాగు కావడం గమనార్హం. మొక్కజొన్న 2,675 ఎకరాల సాగుకు గానూ 4,552 ఎకరాల్లో లక్ష్యానికి మించి సాగైంది. పత్తి 59,368 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 8,810 ఎకరాల్లో మాత్రమే విత్తనం పడింది.అన్నమయ్య జిల్లాలో 1,40, 797 ఎకరాల్లో పంటల సాగు చేయడం వ్యవసాయశాఖ లక్ష్యం. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ నుంచి నేటి వరకు 19,193 ఎకరాల్లోనే విత్తనం పడింది. జిల్లా ప్రధాన ఆహారపు పంట వేరుశనగ. జిల్లా వ్యాప్తంగా 93,892 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 8,835 ఎకరాల్లోనే విత్తనం పడింది. ఈలెక్కన 9.04 శాతం విస్తీర్ణంలో విత్తనం పండింది. మిగిలిన 91 శాతం పొలమతా బీళ్లుగానే దర్శనమిస్తోంది.

ఈ ఏడాది జూన్, జులై, ఆగస్టు మాసాల్లో తీవ్ర వర్షాభావం వెంటాడింది. 68.2 మిల్లీమీటర్లు నమోదు కావాల్సి ఉండగా 21.6 శాతమే నమోదైంది. ఈలెక్కన -68.3 మిల్లీమీటర్లు లోటు వర్షపాతం నమోదు కావడం ఆందోళన కలిగించింది. గతేడాది జూన్‌లో 102 మిల్లీమీటర్లు అధిక వర్షపాతం నమోదు కావడం గమనార్హం. జులైలో 96.7 శాతం సాధారణ వర్ష పాతం నమోదు కావాల్సి ఉండగా, 50.1 శాతం నమోదైంది. ఆగస్టులో 118 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 120 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావడం కాస్త ఊరనిచ్చింది. ఈలెక్కన జిల్లా వ్యాప్తంగా -11.6 శాతం లోటు కొనసాగుతుండడం గమనార్హం. అన్నమయ్య జిల్లాలో జూన్‌లో 75.1 మిల్లీమీటర్లు వర్షపాతం కురవాల్సి ఉండగా 26.6 శాతమే కురిసింది. ఈలెక్కన -64.6 శాతం లోటు కొనసాగుతోంది. జులైలో 62.2 మిల్లీమీటర్లు నమోదు కావాల్సి ఉండగా 42.9 మిల్లీమీటర్లు నమోదు కావడం గమనార్హం. ఈలెక్కన -31.0 మిల్లీమీటర్లు లోటు వర్షపాతం నమోదైంది. ఆగస్టులో సైతం మోస్తరు వర్షపాతానికి పరిమితం కావడం గమనార్హం. ఈలెక్కన అన్నమయ్య జిల్లా -44 లోటు వర్షపాతం కొనసాగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఫలితంగా కడప, అన్నమయ్య జిల్లాలో ఖరీఫ్ సీజన్ మందగమనంలో సాగుతోంది. కడప, అన్నమయ్య జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాని పరిస్థితుల నేపథ్య ంలో 75 శాతంలోపు ఖరీఫ్ సాగు పడిపోతుందనే అంచనాల నేపథ్యం ఆందోళన కలిగిస్తోంది.

సాగు లక్ష్యాన్ని అధిగమిస్తాం

జిల్లాలో ఈస్ట్, నార్త్ మన్‌సూన్ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సెప్టెంబర్ వరకు విత్తనం వేయడానికి అవకాశం ఉంది. జులై మాసంలోనే కెసి కెనాల్‌కు నీటిని విడుదల చేసిన నేపథ్యంలో 30 వేల హెక్టార్లలో వరి, ఇతర పంటలు సాగుకు అవకాశం ఉంది. లక్ష్యాన్ని అందుకునే అవకాశం ఉందని ఆశాభావంతో ఉన్నాం.

- బి.చంద్రానాయక్, జిల్లా వ్యవసాయాధికారి, కడప.

దళారీ వ్యవస్థను రద్దు చేయాలి

- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-చిట్వేలి

బొప్పాయి రైతులను నిలువునా మోసం చేస్తున్న దళారుల వ్యవస్థను రద్దు చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బొప్పాయి రైతులకు బాసటగా శుక్రవారం మైలపల్లి పంచాయతీ ఓసురమ్మ దేవాలయం ఆవరణలో కొత్తపల్లి ఈశ్వరయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ దళారుల వ్యవస్థ రద్దు చేయాలని, బొప్పాయి రైతులకు కనీసం గిట్టుబాటు ధర రూ.15 ఇవ్వాలని, ప్రభుత్వం జోక్యం చేసుకొని, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో దళారులు లైసెన్స్ లేకుండా సిండికేట్ వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. కలెక్టర్ నిర్ణయించిన రూ.పది ధర కూడా అమలు చేయడం లేదని, ఇది చాలా అన్యాయమన్నారు. కలెక్టర్ నిర్ణయాన్ని ధిక్కరించిన వారి పైన ఎందుకు కేసులు నమోదు చేయలేదని ప్రశ్నించారు. సూటు పేరుతో వెయ్యి కిలోలకు వంద కిలోలు తీసుకుంటూ రైతులను మోసం చేస్తున్నారన్నారు. సూటు రద్దు చేయాలన్నారు. వ్యాపారస్తులు, రైతులకి సరుకుల పట్టీలు ఇవ్వాలన్నారు. రైతు పేరు, వ్యాపారి పేరు, గ్రామం, లారీ, నెంబరు టన్నులు, ధర వివరాలతో కూడినది రైతులకు, వ్యాపారస్తులు ఇవ్వాలన్నారు. ఉద్యాన శాఖ అధికారులు, మార్కెటింగ్ అధికారుల పర్యవేక్షణలో జరగాలన్నారు. వే బ్రిడ్జ్ కాటా తూకాల్లో మోసం జరుగుతున్నాయని, విచారణ జరిపి అరికట్టాలన్నారు. ప్రభుత్వమే సబ్సిడీ ద్వారా నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలన్నారు. ఎరువులు, పురుగు మందులు సబ్సిడీ ద్వారా రైతులకు అందించాలన్నారు. ఉచిత పంటల బీమా పథకాన్ని ప్రభుత్వ అమలు చేయాలన్నారు. రైతుల ఐక్యమై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. తమ హక్కుల హక్కుల కోసం రైతు సంఘం అండగా ఉంటుందని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం, ఆందోళనలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.చంద్రశేఖర్, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్ర, మండల అధ్యక్షులు, ఏదోటి ఆదినారాయణ, కార్యదర్శి, చుక్క రాజు, రవీంద్ర రాజు, ఆర్గనైజ్ సెక్రెటరీ తుంగ శివకృష్ణచౌదరి, వర్కింగ్ ప్రెసిడెంట్ మన్నూరు వెంకటరత్నం, ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఈశ్వరయ్య, మన్నూరు విశ్వనాథరెడ్డి, సువారపు సుబ్రహ్మణ్యం, షేక్ జాకీర్, కార్యదర్శులు, కట్ట గిరిబాబు, వెలుగుల నాగేశ్వర రాజు, కొమిరెడ్డి గంగిరెడ్డి, జనార్ధన్, సలహాదారులు ముద్ద పెంచల్ రెడ్డి, కొండల సుధాకర్ యాదవ్, ఆకేపాటిసుధాకర్‌రెడ్డి, నాయకులు రేకులకుంట వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రాధాన్యతతో ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



కలెక్టర్ శ్రీధర్‌కు అర్జీలు ఇస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి-రాయచోటి

ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రాధాన్యతగా పరిగణించి పరిష్కరించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రతి నెల మూడవ శుక్రవారం నిర్వహించే ఉద్యోగుల గ్రీవెన్స్‌డే కార్యక్రమంలో ఆయన ఉద్యోగుల సమస్యలపై అర్జీలు స్వీకరించారు. జెసి ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదన్‌రావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి నెలా మూడవ శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ డేను నిర్వహించి, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పారదర్శకంగా పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉద్యోగులు తమ బాధ్యతలను గుర్తించి మరింత సమర్థవంతంగా పనులు చేయాలని ఆయన ఆదేశించారు. వేతనాల చెల్లింపు, బదిలీలకు సంబంధించిన అర్జీలే ఎక్కువగా వచ్చినట్లు తెలిపారు. అన్ని సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత శాఖాధికారులను తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉద్యోగులు సేవా దృక్పథంతో పనిచేస్తే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని, ప్రభుత్వం వారి సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. సమర్థవంతంగా పని చేస్తేనే పరిపాలన బలోపేతం అవుతుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత మెరుగైన రీతిలో చేరుతాయని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని కలెక్టర్ పునరుద్ఘాటించారు. ఇంకా ఈ కార్యక్రమంలో 20 మంది ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించి ఉద్యోగులకు భరోసా కల్పించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

వినియోగదారుల మన్ననలు పొందాలి

- ఎస్‌పిడిసిఎల్ సిఎండి సంతోష్‌రావు



మాట్లాడుతున్న ఎస్‌పిడిసిఎల్ సిఎండి సంతోష్‌రావు

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

మరింత మెరుగైన సేవలందించడం ద్వారా వినియోగదారుల మన్ననలు పొందాలని ఎస్‌పిడిసిఎల్ సిఎండి కె.సంతోష్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ కళ్యాణ మండపంలో విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులకు 'ప్రజా సానుకూల అవగాహనపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులే మనకు దేవుళ్ళతో సమానమన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా, లో వోల్టేజీ సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. ఉద్యోగులు, కార్మికులు తాము పనిచేసే ప్రాంతాల్లోనే నివాసముంటూ వినియోగదారులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని కోరారు. అలా నివాసం ఉండని వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిలు వినియోగదారులతో సత్సంబంధాలను నెరపాలంటూ సూచించారు. పట్టణ, మండల కేంద్రాలలో లోవోల్టేజీ సమస్య ఉన్న ప్రాంతాల్లో అదనపు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌లను అమర్చాలంటూ కోరారు. చీఫ్ జనరల్ మేనేజర్ జానకిరామ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనపై సమీక్షను నిర్వహించారు. మండల అధికారులకు పథకం కింద పనిచేసే ఉద్యోగులకు తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. సదస్సులో జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, ఇఇలు యుగంధర్, ఈశ్వర్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, రాజశేఖరరెడ్డి, గంగాధర్, జిల్లాలోని రాజంపేట, పీలేరు, మదనపల్లె డివిజనల్‌లలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఒఅండ్ఎం సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

బదిలీ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

- సబ్ కలెక్టర్‌కు మున్సిపల్ కార్మికుల వినతి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట పురపాలక పరిధిలోని బదిలీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ కోరారు. శుక్రవారం సబ్ కలెక్టర్ భావనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న 30 మంది పారిశుధ్య బదిలీ కార్మికులకు మూడు నెలల నుండి వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారుని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు కుటుంబాలను పోషించుకోవాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తమ పిల్లల చదువులు, ఇతర అవసరాల కోసం ప్రయివేటు వ్యక్తుల వద్ద వడ్డీలకు అప్పులు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పాడిందని తెలిపారు. వెంటనే స్పందించిన సబ్ కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి జీతాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలియజేశారు. జీతాలు సహకాలంలో చెల్లించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.వి.రమణ, లక్ష్మీదేవి, ప్రసాద్, ఎం.రమణ, బాలాజీ, కోనయ్య, సి.హెచ్.నరసింహులు, రమేష్ బాబు, కిరణ్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు 'మేడా' ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : బాలరాజుపల్లెలోని పెన్నా నదిలోకి ఈతకు వెళ్లి గురువారం ప్రాణాలు కోల్పోయిన అన్నమాచార్య విద్యార్థుల మృతి పట్ల రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. విద్యార్థుల దుర్మరణం దురదృష్టకరమని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఒక్క కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో చెరువులు, కాలువలు, నదులు, జలాశయాలు ఉప్పొంగి ప్రవహిస్తున్న క్రమంలో చిన్నారులు, విద్యార్థులు, యువత మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రభుత్వం అనుమతిస్తే నియోజకవర్గంలోని ఆరు మండలాలలో తన సొంత నిధులతో ఈత కొలనులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. యువత సరదాగా చేసే చర్యలు తల్లిదండ్రులకు తీరని కడుపుకోత మిగులుస్తాయని, యువత అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని శుక్రవారం బహుజన యువసేన (బివైఎస్) ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బివైఎస్ అధ్యక్షుడు పునీత్ మాట్లాడుతూ జిల్లా హోదా కలిగిన మదనపల్లె రోడ్లమీద ప్రజలు, పిల్లలు, మహిళలు, వృద్ధులు ప్రయాణించాలన్నా, నడుచుకొని వెళ్లాలన్నా భయపడే పరిస్థితి నెలకొందంటే అందుకు ముఖ్య కారణం సంబంధిత అధికారులేనన్నారు. సమస్య పరిష్కారం కొరకు విద్యుత్, ఆర్అండ్‌బి, మున్సిపల్ అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేసిన నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారన్నారు. మదనపల్లె చుట్టుపక్కల ఉన్న చిన్న పట్టణాలైనా వాల్మీకిపురం, అంగళ్లు, తంబళ్లపల్లి వంటి ఊర్లలో అధికారులు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటుంటే, అధికారులు నివాసాలు ఉంటూ, రోజు ప్రయాణిస్తూ చూస్తున్న మదనపల్లెలో మాత్రం అధికారులు ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడం చాలా విచార కరమన్నారు. కనీసం ప్రజలు నడుచుకొని వెళ్లడానికి ఉన్న రెండు, మూడు ఫుట్ పాతులు మీద వ్యాపారాలు నిర్వహించడంతో నడవడానికి తీవ్ర ఇబ్బంది నెలకొందన్నారు. కార్యక్రమంలో బివైఎస్ నాయకులు హరికష్ణ, జిలాని, శశి కుమార్, వినయ్, నవీన్, నాగేంద్ర, భాను, బ్రహ్మ, ఆరిఫ్, బాలకృష్ణ, సంతోష్, హరీష్, శ్రీనివాసులు, రామ్మోహన్ పాల్గొన్నారు.



ఇండస్ట్రియల్ పరిశీలన చేస్తున్న మిట్స్ విద్యార్థులు

ఎన్ఎఆర్ఎల్‌ను సందర్శించిన 'మిట్స్' విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె: మదనపల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ బి.టెక్ రెండవ సంవత్సరం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సైబర్ సెక్యూరిటీ) విభాగం విద్యార్థులు తిరుపతిలోని నేషనల్ అట్మాస్ఫియరిక్ రీసెర్చ్ లాబొరేటరీ (ఎన్ఎఆర్ఎల్)ను పారిశ్రామిక సందర్శనలో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వాతావరణ శాస్త్రాలు, ఉపగ్రహ కమ్యూనికేషన్, వాతావరణ అంచనా మరియు అంతరిక్ష సాంకేతిక అనువర్తనాలపై జరుగుతున్న ఆధునిక పరిశోధనల గురించి విలువైన అవగాహనపొందారు. సిద్ధాంతపరమైన అభ్యాసం మరియు ఆచరణాత్మక అనువర్తనాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడానికి ఈ సందర్శనం ఉపయుక్తమైందని అధ్యాపక బృందంలోని ఎం.శ్రీలక్ష్మీ ప్రీతి, గౌతమ్ పేర్కొన్నారు. విద్యార్థులకు వాతావరణ పరిశోధన, అంతరిక్ష అధ్యయనాలలో ఉపయోగించే సాంకేతికతలపై లోతైన జ్ఞానం ఏర్పడటంతో పాటు, భవిష్యత్తులో పరిశోధన, ఆవిష్కరణ మరియు సైన్స్ టెక్నాలజీ రంగాల్లో కెరీర్‌లకు ఇది ఒక మంచి వేదికగా మారిందని వారు అభిప్రాయపడ్డారు.

మాతా, శిశు మరణాల నివారణకు కృషి

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్: మాతా, శిశు మరణాల నివారణకు డాక్టర్లు, వైద్యసిబ్బంది మరింతగా కృషి చేయాలని డిఐఒ ఉషశ్రీ అన్నారు. పట్టణంలోని రామాపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లాలోని పిహెచ్‌సి, యుపిహెచ్‌సిలలో పనిచేస్తున్న వైద్యులకు సమీకృత ఎక్కువ ప్రమాదం గల గర్భిణుల జాడను గుర్తించి వారికి సుఖప్రసవడం నిర్వహించడం అనే అంశంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రమాదం గల గర్భిణుల జాడను గుర్తించడం ఎలా అనే అశంపై రాష్ట్ర రాజధాని విజయవాడలో శిక్షణ పొందిన నిపుణులైన వైద్యులతో జిల్లాలోని వైద్యులకు ప్రత్యేక శిక్షణను ఇప్పిస్తున్నట్లు తెలిపారు. గర్భిణుల జాడలను గుర్తించి వారి ఆరోగ్య పరిస్థితి నెల వారీగా ట్రాక్‌చేసి సుఖప్రసవం అయ్యేవిధంగా వైద్యులు, వైద్య సిబ్బంది ప్రణాళికలు తయారు చేసుకుంటారన్నారు. గర్భిణిని ఎలాంటి సమయంలో, ఎలాంటి ఆసుపత్రులకు రెఫర్ చేయాలనే అంశంపై శిక్షన ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ట్రైనర్స్ కిజియా, లీల, వైద్యులు పాల్గొన్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు : కలెక్టర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశకి-రాయచోటి

జిల్లాలో రసాయనిక ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి వ్యవసాయాధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎపి సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ యూరియా కొరత రానివ్వకుండా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి శివ నారాయణ తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం వ్యవసాయాధికారులతో కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ జిల్లాలో రసాయనిక ఎరువుల కృత్రిమ కొరత సృష్టించే డీలర్లు, సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రసాయనిక ఎరువులు బ్లాక్ మార్కెట్టుకు తరలించినా, తగినన్ని నిలువలు లేవని నివారించినా సంబంధిత సంస్థలపై పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రైతు సేవా కేంద్రాలలో రైతులకు అవసరమైన రసాయనిక ఎరువుల కొరత రానీయకుండా సిద్ధంగా ఉంచుకోవాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. అన్ని మండలాల్లో బృందాలు ఏర్పాటు చేసి ముమ్మరంగా తనిఖీలు నిర్వహించాలని పేర్కొన్నారు. రైతుల ఎరువుల అవసరాలను తీర్చేందుకు సమయానికి, సమృద్ధిగా ఎరువులు అందించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. అవసరానికి మించి ఎరువులు అందుబాటులో ఉంచుకో వాలన్నారు. క్షేత్రస్థాయిలో యూరియా, ఎరువుల కొరత లేకుండా ఉండేలా విజిలెన్స్ నిఘా పెట్టాలని కలెక్టర్ సూచించారు.

హెచ్ఐవిపై విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ సంయుక్తంగా జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు మండల, డివిజనల్ స్థాయిల్లో ఎంపికైన జూనియర్ ఇంటర్ విద్యార్థుల కోసం శుక్రవారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా నిర్వహిస్తారని, జనాభాలో హెచ్ఐవి, సుఖ వ్యాధులపై అవగాహన కల్పించడం, సురక్షిత పద్ధతులు పాటించడం, హెచ్ఐవి పాజిటివ్ వారిపట్ల వివక్షను తగ్గించడం, విద్యార్థుల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎక్కువ మంది హెచ్ఐవి పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించడమే ఈ క్విజ్ ఉద్దేశమని వివరించారు. జిల్లా స్థాయి విజేతలు రాష్ట్ర స్థాయి పోటీలలో హాజరు కావలసి ఉంటుందని తెలిపారు. ఇందులో ప్రథమ బహుమతి ప్రతిభ జూనియర్ కాలేజ్ విద్యార్థులు (రాయచోటి), రెండవ బహుమతి కృష్ణారెడ్డి సిద్ధార్థ జూనియర్ కాలేజ్ (మదనపల్లి), తృతీయ బహుమతి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల (రాయచోటి) విజేతలందరికీ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్యాష్ ప్రైజ్‌లు వారి సొంత బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి అవగాహనతో ముందడుగు వేస్తే హెచ్ఐవి రహిత సమాజం నిర్మించవచ్చని తెలిపారు. జిల్లా ప్రోగ్రాం మేనేజర్ వి.భాస్కర్ మాట్లాడుతూ వైద్య శాఖ తరపున వివిధ రకాల హెచ్ఐవి నియంత్రణ కార్యక్రమాలు నిరంతరంగా నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ డాక్టర్ రవి, పిసిఎస్‌యుఎస్ ప్రాజెక్ట్ మేనేజర్ స్వాతి, సిబ్బంది, లింక్ వర్కర్ అల్లవల్లి, వారి బృందం పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ రమేష్‌బాబు

నగర పంచాయతీ మేనేజర్ ఉన్నట్లా.. లేనట్లా..!

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీకి మేనేజర్ ఉన్నట్లా... లేనట్లా అని పట్టణ ప్రజల సందేహం వ్యక్తం చేస్తున్నారు. నూతన మేనేజర్ టి.రాము బాధ్యతలు చేపట్టి రెండు నెలలు అయింది. అయినప్పటికీ అధికారులు లాగిన్లు, వెబ్ సైట్లు ఏవి కూడా మేనేజర్ లాగిన్‌లో కాకుండా జెఇఒ చక్కబెడుతున్నారు. ముఖ్యంగా సిఎంఎస్, పిజిఆర్ఎస్ లాగిన్స్, ఇఆర్‌పి డైలీ మెయింటెనెన్స్, కౌన్సిల్ ప్రియమన్స్, కౌన్సిల్ మినిట్ బుక్ ప్రజలకు సంబంధించిన పనులు, బిల్లులు తదితర కార్యకలాపాలు మేనేజర్ లాగిన్ ద్వారానే జరగాలి. నిబంధనలకు విరుద్ధంగా జెఇఒ ద్వారా ఈ పనులను ఎంచక్కా, అనుమానం రాకుండా జరిపేస్తున్నారు. పూర్తిస్థాయి మేనేజర్ ఉన్నప్పటికీ జెఇఒతోనే పనులు చక్కబెట్టు తుండడం వెనుక ఉన్న మతలబు ఏమిటో అర్థం కావడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా నగర పంచాయతీ కమిషనర్ ఈ విషయంపై ఆరా తీసి మేనేజరుకు సంబంధించిన లాగిన్ అధికారాలను అప్పగించాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి-కలికిరి

ఇటీవలి ఉద్యోగ సంఘాలతో సిఎస్ చర్చలను స్వాగతిస్తున్నామని, గతంలో ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీమేరకు డిఎ బకాయిలు, మెడికల్ రీఎంబర్స్‌మెంట్ బిల్లులు, ఎర్న్ లీవ్ బిల్లులు, ఎపిజిఎల్ఐ పిఎఫ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. పిఎఫ్, ఎపిజిఎల్ఐ రుణాలు ఇప్పటికే ఏప్రిల్ వరకూ చెల్లించారని, మిగతా వాటినీ త్వరలో మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీప్రకారం డిఎలతో పాటు ఐఆర్ ను ప్రకటించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారని అన్నారు. మెరుగైన పిఆర్‌సి ఇస్తామన్న హామీ డిఎ బకాయిలు, డిఎలు, ఐఆర్ గానీ ఇవ్వకపోవడంతో ఉద్యోగుల్లో నిరాశ నెలకొందని తెలిపారు. వెంటనే బకాయిలను చెల్లించాలని కోరారు.

ఇరిగేషన్ సబ్ డివిజన్‌లో సిబ్బంది కొరత

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వే కోడూరు ఇరిగేషన్ సబ్ డివిజన్ పరిధిలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. సబ్ డివిజన్ పరిధిలో రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట ,పెనగలూరు, చిట్వేలి ఐదు మండలాలు ఉన్నాయి. సబ్ డివిజన్ అధికారిగా ఎం.వినోద్‌కుమార్ విధులు నిర్వహిస్తున్నారు. పింఛ ప్రాజెక్టులో రెగ్యులర్‌గా పని చేస్తున్న జెఇ నాగేంద్ర నాయక్ పుల్లంపేట మండల ఇన్‌ఛార్జిగా ఉన్నారు. వేంపల్లిలో రెగ్యులర్‌గా పనిచేస్తున్న జెఇ బాబు పెనగలూరు, చిట్వేలి మండలాలకు ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్నారు. డిఇగా పనిచేస్తున్న వినోద్‌కుమార్ కోడూరు, ఒబులవారిపల్లె మండలాలకు ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్నారు. ఒక్కో కాధికారి రెండు మూడు మండలాలకు ఇన్‌చార్జిలుగా పని చేయాలంటే పని భారం అధికంగా ఉంటుంది. రానున్న వర్షాకాలంలో పరిస్థితి ఇలాగే కొనసాగితే ఏవిధంగా విధులు నిర్వహించాలో అర్థం కావడంలేదని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. గాలేరు-నగరి, సృజల ప్రవంతి విభాగంలో అన్నమయ్య ప్రాజెక్టు విభాగంలోనూ పని భారం తక్కువగా ఉంటుందని, అలాంటి ప్రాజెక్టుల నుంచి సిబ్బందిని రైల్వేకోడూరు సబ్ డివిజన్‌కు బదిలీ చేసినట్లయితే విధుల నిర్వహణ సులభతరంగా ఉంటుందని పలువురుఅభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వెలిగల్లులో వినాయక విగ్రహాల నిమజ్జనం నిషేధం

ప్రజాశక్తి-గాలివీడు

వెలిగల్లు రిజర్వాయర్‌లో వినాయక విగ్రహాలను ప్రాజెక్టులో నిమజ్జనం నిషేధించినట్లు వెలిగల్లు ప్రాజెక్ట్ ఎఇ ఎం.సాంబశివుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం వెలిగల్లు ప్రాజెక్టులో నీటిని గాలి వీడు మండలంతో పాటు రాయచోటి పట్టణానికి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ నీటిలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల నీరు కాలుష్యపూరితమైతుందనే ఉద్దేశంతో వెలిగల్లు ప్రాజెక్టులో విగ్రహ నిమజ్జనాన్ని నిషేధించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని వినతి పత్రం తహశీల్దార్, ఎంపిడిఒ, పంచాయతీ కార్యదర్శికి అందించినట్లు తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి-నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని తహశీల్దార్ అమరేశ్వరి శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి భోజన నాణ్యత వివరాలను అడిగి తెలుసుకుని సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంఇఒ నాగయ్య, ఎంఇఒ అనంత కృష్ణ, కళాశాల లెక్చరర్ లక్ష్మీనారాయణ, పిడి గౌరీ, విద్యార్థులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనానికి ప్రహరీ పూర్తి

ప్రజాశక్తి-గాలివీడు :

వెలిగల్లు పునరావాస కేంద్రంలో కమ్యూనిటీ హాలుకు రూ.17 లక్షల వ్యయంతో ప్రహరీని పూర్తి చేసినట్లు గ్రామ సర్పంచ్ ఎస్.నఫీస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1988లో ప్రభుత్వం కమ్యూనిటీ హాలును మంజూరు చేసిందని అన్నారు. కమ్యూనిటీ హాలు ప్రభుత్వ సంబంధించిన సమావేశాలు నిర్వహించేవారని అన్నారు. పునరావాస కేంద్రంగా ఉండేదని అన్నారు. ప్రహరీ లేకపోవడంతో ఇబ్బంది కరంగా ఉండటంతో ప్రహరీనేర్పాటు చేశామన్నారు.

పింఛను ఇచ్చి ఆదుకోండి సారూ...!

- పుట్టుకతోనే శారీరక, మానసిక వికలత్వం
- బాలుడి తల్లిదండ్రుల వేడుకోలు

ప్రజాశక్తి-రామాపురం

పుట్టుకతోనే శారీరక, మానసిక వికలత్వంతో ఆ బాలుడు నరకయాతన అనుభవి స్తున్నాడు. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబానికి చెందిన తాము తమ బిడ్డను పోషించుకునేందుకు భారంగా మారిందని తల్లిద ండ్రులు ఆవేదన చెందు తున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి పథకాలు అందలేదని ఫించన్ మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని రాచపల్లె గ్రామానికి చెందిన చిన్నోడు అనే వ్యక్తి చెందిన రెండవ సంతానమైన వెంకటశివ పుట్టుకతోనే శారీరక వికత్వంతో పాటు మానసిక వికలత్వంలో భాద డుతున్నారు. చాక లి వృత్తిలో ఉన్న తాము రోజు పనికి వెళ్తే గాని తమ జీవనం సాగదని చెబు తున్నారు. తమ కొడుకు పుట్టుక తోనే శారీక, మానసిక విక లత్వంతో పు ట్టాడని అన్నారు. నెలపై పాకుతూ ఉంటాడని, ఎప్పుడు ప్రమా దానికి లోనవు తాడోనని భయాందోళతో మంచానికే కట్టి ఉంచుతామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తమ కొడుకు పరిస్థితిని పరి శీలించి పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని వారు వేడుకున్నారు.


వెంకటశివ

ఉత్తమ విద్య అందించాలి : ఎంపిడిఒ


విద్యార్థికి విద్యా సామగ్రి అందిస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విలువలతో కూడిన ఉత్తమ విద్యను అందించాలని ఎంపిడిఒ రమేష్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం పెద్ద మాదిగపల్లెలోని మోడల్ ప్రైమరీ స్కూల్‌లోని విద్యార్థులకు మదనపల్లెకు చెందిన దాత మురళి విద్యాసామగ్రి అందిస్తున్న కార్యక్రమంలో ముఖ్య అతిథు లుగా ఎంపిడఒతో పాటు డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజు, ఎంఇఒ పద్మావతి, పాఠశాల ప్రధానోపా ధ్యాయులు నాగరాజు పాల్గొన్నారు. విద్యార్థులకు నోటుపుస్తకాలు, ఐడి కార్డ్స్, టై, బ్యాడ్జెస్, అట్టలు, పలకలు, వివిధ రకాల ఆట వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఈ యేడాది ప్రభుత్వ పాఠశాలలో అనేక సంస్కరణలను తీసుకవచ్చిందని తెలిపారు. మోడల్ ప్రైమరీ స్కూల్స్ ను ఏర్పాటు చేసిందని, ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశా లలగా ఉన్నతీకరించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నడూ లేని విధంగా విద్యార్థుల సంఖ్య పెరిగిందని తెలిపారు. ప్రయివేట్ పాఠశాలలను వదిలి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం విద్యార్థులు చేరుతున్నారని పేర్కొ న్నారు. విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి ఉన్నతమైన భవిష్యత్తుకు పునాదులు వేయాలని సూచించారు. మన ఊరి లోని ప్రభుత్వ పాఠశాలలను మనం ప్రోత్సహించాల్సి ఉందన్నారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ విధానం అందుబాటులో ఉండటంతో ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ పాఠశాల స్థితిగతులను, విద్యా బోధనను పరిశీలిస్తూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. స్తోమత కలిగిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలకు అండగా నిలబడాలని అన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి హెచ్‌ఎం.రవి, ఉపాధ్యాయుల శివశంకర్, కరుణాకర్, కవిత, మధుకుమారి పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జనసేన పార్టీ రాజంపేట పార్లమెంటు ఇన్‌ఛార్జి యల్లటూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో శుక్రవారం సినీ నటుడు చిరంజీవి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మన్నూరులోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో గల యల్లటూరు భవన్ నందు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి సూపరిం డెంట్ నాగేశ్వరరాజు, సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ అనిల్, ఎఒ భూమిరెడ్డితో కలిసి మెగా అభిమానులు, జనసేన కార్యకర్తలు ఆసుపత్రిలోని రోగులకు బ్రెడ్లు, పండ్లు, జ్యూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యల్లటూరు మాట్లాడుతూ మెగాస్టార్ స్వయంకృషితో అంచెలంచెలుగా ఎదిగి అభిమానుల హృదయాలలో చిరంజీవిగా చిరస్థానాన్ని పదిలపరుచుకున్నారని అన్నారు. కేవలం సినిమాలతోనే కాక దాతృత్వం, సేవా కార్యక్రమాలతో ఆయన అందరి హృదయాలను ఆకర్షించాడని తెలిపారు. కార్యక్రమంలో మెగా అభిమానులు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** పట్టణంలోని వెలుగు ప్రత్యేక పాఠశాల, వృద్ధాశ్రమంలో చిరంజీవి అభిమాని, రాయల్ బుక్ సెంటర్ యజమాని సుధాకర్, తంబళ్లపల్లి, మదనపల్లి ఉమ్మడి చిత్తూరు జిల్లా చిరంజీవి ప్రజాసేవా సమితి సిబ్బంది, అభిమాన సంఘ సభ్యులు ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్‌కట్ చేసి,విభిన్న ప్రతిభావంతులు, వృద్దులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిరంజీవి ప్రజాసేవా సమితి సభ్యులకు వెలుగు సెక్రటరీ యం. ఉదయమోహన్‌రెడ్డి జ్ఞాపికను అందజేశారు. కార్యాక్రమంలో వెలుగు వెంకటేష్, ప్రిన్సిపల్ లీనాకు మారి, వార్డెన్ స్వీటీ, చిన్నారులు, వృద్దులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా రామాంజనేయులు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండల రేషన్ షాపులు డీలర్ల సంఘం అధ్యక్షుడిగా మండ్ల రామాంజనేయులును శుక్రవారం రేషన్ షాపు డీలర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా మండల రామాంజనేయులు ఉపాధ్యక్షు లుగా పి.సుబ్బయ్య సెక్రటరీగా అన్వర్‌బాషను ఎన్నుకు న్నట్లు సంఘ అధ్యక్షుడు రామాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్ల సమస్యలను తక్షణమే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం తమవంతు కృషి చేస్తామని రామాం జనేయులు తెలిపారు. ప్రభుత్వం నుంచి డీలర్లకు వచ్చే పారితోషకాన్ని డీలర్ల ఖాతాలోకి జమ అయ్యే విధంగా చూస్తామన్నారు. అనంతరం తహశీల్దార్ కాంత్‌కుమార్, డిటి రెడ్డన్నను ఆర్‌ల సమక్షంలో రామాంజనే యులను సన్మానించారు.

సేవ చేయడంలోనే ఆనందం

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

సేవ చేయడంలో ఉండే ఆనందం ఎక్కడ ఉండదని డాక్టర్ హెచ్.ఉషారాణి పేర్కొన్నారు. శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో మాజీ విలేఖరి సుభాష్ చంద్రబోస్‌కు చక్రాల కుర్చీ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని కొత్తపేట రామాపురంలో నివాసం ఉండే మాజీ విలేఖరి సుభాష్ చంద్రబోస్ గత కొంతకాలంగా రోడ్డు ప్రమాదంలో గాయపడి మంచంపై ఉన్న విషయాన్ని తెలుసుకొన్న లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి సభ్యులు తెలపడంతో వెంటనే స్పందించి ఆయన నివాసం వద్దకు వెళ్లి పరామర్శించారు. అనంతరం ఆయనకు చక్రాల కుర్చీ అందించారు. వైద్య పరంగా ఎలాంటి సమస్య వచ్చినా తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో రీజినల్ చైర్మన్ లయన్ షేక్ మొహమ్మద్, కోశాధికారి కె.మనోహర్‌రాజు, రాజమోహన్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కలికిరి

వర్షాలు కురుస్తుండటంతో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిహెచ్‌ఇఒ మహ్మద్ రఫీ పేర్కొన్నారు. మండలంలోని మేడికుర్తి పిహెచ్‌సి పరిధిలోని కొట్టాల గ్రామం లో నిర్వహిస్తున్న 104 సేవలలో భాగంగా కాలాను గుణంగా వ్యాప్తి చెందే డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, అతిసారా, టైఫాయిడ్, కామెర్లు, కండ్ల కలక వంటి జబ్బులపై అవగాహన కల్పించి కర పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటిని కాచి చల్లార్చి తాగాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తడి బట్టలు ఎక్కువ సేవు వేసుకోరదని, ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. వీధుల్లో అమ్మే పానీయాలు, ఆహార పదార్థాలను తినరాదని, పానీపూరి, గోబీ లాంటివి వాటికి దూరంగా ఉండాలన్నారు. జ్వరాలు వస్తే ప్రభుత్వ అస్పత్రులకు రావాలని, మరుగుదొడ్ల ఉపయోగం చేసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. నీటి వనరులను కలుషితం కాకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం పాఠశాలను సందర్శించి విద్యార్థులకు చేతుల శుభ్రత గురించి అవగాహన కల్పించారు. పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. టిబి. ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. కార్యక్రమంలో పర్యవేక్షకులు సుధాకర్, టీచర్స్ శంకర, అజంతుల్లా, సిహెచ్‌ఒ చందు ప్రియా, ఎఎన్ఎం మల్లీశ్వరి, ఆశాకార్యకర్తలు గంగాదేవి, ఆదిలక్ష్మి, 104సిబ్బంది, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి-చిట్వేలి : మండల పరిధిలోని పుల్లంపేట, పెనగలూరు, చిట్వేలి మండలాలకు సంబంధించిన విద్యుత్ సమ స్యలపై రిటైర్డ్ జడ్జి వి.శ్రీనివాస్ ఆంజనేయమూర్తి అధ్యక్షతన సమస్యల పరిష్కార వేదికను స్థానిక విద్యుత్ కార్యా లయావరణంలో విద్యుత్ ఉన్నతాధికారులు శుక్రవారం ఏర్పాటు చేశారు.విద్యుత్ అంతరాయం, రైతులకు విద్యుత్ స్తంభాల సమస్య, మరియు విద్యుత్ ఘాతానికి గురైతే ప్రభుత్వం నుంచి వచ్చే వివిధ రకాల వెసులుబాటు పైన జడ్జి ఆంజనేయమూర్తి క్షుణ్ణంగా అధికారులకు వివరించి చెప్పారు. పలు రకాల విద్యుత్ సమస్యల పైన ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి పూర్తిస్థాయిలో సమాచారం అందకపోవడం వలన మూడు మండలాలకు సంబంధించి ఒకటి,రెండు సమస్యలు సత్వరమే పరిష్కరించారు. మొత్తం 15 అర్జీల లోపలనే సమావేశాన్ని ముగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కార్యక్రమంలో ఇఇ ఎన్‌రాజశేఖర్‌రెడ్డి, డిఇఇ మురళీధర్‌రెడ్డి, ఎస్ఎఒ బ్రహ్మయ్య, ఎడిఇ ఎస్ శిరీష, స్థానిక ఎఇ వెంకటాచలపతి,అధికారులు పాల్గొన్నారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న రిటైర్డ్ జడ్జి

108 ఎప్పుడు ఆగుతుందో తెలియదు..!

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక సిహెచ్‌సికి చెందిన 108 వాహనం ఎప్పుడు, ఎక్కడ ఆగిపోతుందో తెలియని పరిస్థితి. శుక్రవారం కడుపునొప్పితో బాధపడుతున్న వ్యక్తిని బండ్రేవు నుంచి తంబళ్లపల్లె ఆసుపత్రికి తరలిస్తుండగా బోయపల్లె వద్ద 108 వాహనం ఆగిపోయింది. వాహనం మొరాయించడంతో రోగి ఆటోలో ఆసుపత్రికి వచ్చాడు. గత రెండు నెలల వ్యవధిలో పలుమార్లు వాహనం మొరాయించడంతో రోగులు కష్టాలు పడ్డారు. 108 వాహనంలో వెళ్లాలంటే రోగులు భయాందోళన చెందుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆగితే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు కాలం చెల్లిన వాహనాలను మార్చా లని ప్రజలు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణకు మట్టిగణపతి

పిఒపి విగ్రహాలతో పర్యావరణానికి ముప్పు

ప్రజాశక్తి-గాలివీడు

వినాయక చవిత ఉత్సవాలకు ఉత్సవ కమిటీలు సిద్ధమవుతన్నాయి. పండగలు, సంప్రదాయాల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతను కూడా తీసుకోవాల్సిన తరుణమిది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినాయక విగ్రహాలు పర్యావరణానికి ముప్పుగా మారుతున్నాయని, మట్టి విగ్రహాలను ఉపయోగించాలని చెబుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. మండలంలోని ఎక్కువగా పిఒపి విగ్రహాలను ఏర్పాటుకే మొగ్గు చూపుతున్నారు. 15 అడుగుల విగ్రహం నుంచి 20 అడుగుల వినాయక విగ్రహాలను రూ.10వేల నుంచి రూ.లక్ష వరకు వెచ్చిస్తున్నారు. మట్టితో తయారు చేసిన విగ్రహాలు ఏమాత్రం లేవు. గాలివీడు గేటు హెచ్ బి పెట్రోల్ బంక్ ఎదురుగా చిన్న విగ్రహం నుంచి పెద్ద విగ్రహం వరకు వెయ్యి విగ్రహాల పైన అక్కడ ఉంచారు.పిఒపి విగ్రహాల తయారీలో వాడే రసాయన రంగులు నీటిని కలుషితం చేస్తాయని, ఈ రసాయనాలు చెరువులు, ఇతర నీటి వనరుల్లోకి చేరి, చేపలు, ఇతర జీవరాశులకు హాని కలిగిస్తాయని పర్యావరణ పరిరక్షకులు తెలిపారు. పిఒపితో చేసిన విగ్రహాలు నీటిలో కరగకపోవడం వల్ల చెరువులలో పూడిక పెరిగి, నీటి నాణ్యత తగ్గుతుందని అన్నారు. ఈ కలుషితమైన నీరు తాగునీటికి సైతం వినియోగించడంలో అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని చెప్పారు.పర్యావరణహితమైన మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించడం మేలని నిపుణులు సూచిస్తున్నారు. మట్టి విగ్రహాలతో పాటు, కాగితం, పిండి, చింతపిక్కల పొడి, గోమయంతో చేసిన విగ్రహాలను కూడా ఉపయోగించవచ్చని సూచిస్తున్నారు. ఇలాంటి పర్యావరణహితమైన విగ్రహాలను ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయవచ్చని తెలిపారు. మట్టి గణపతిని పూజించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని సూచిస్తున్నారు.


ప్లాస్ట్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన గణపతి విగ్రహాలు

జగన్‌మోహన్‌రాజుకు ఘనస్వాగతం

ఇన్‌ఛార్జి హోదాలో మొదటిసారిగా రాజంపేటకు.. భారీ ర్యాలీ చేపట్టిన టిడిపి శ్రేణులు


చమర్తి జగన్‌మోహన్‌రాజుకు గజమాలతో స్వాగతం పలుకుతున్న టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చమర్తి జగన్మోహన్‌రాజును రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ప్రకటించిన నేపథ్యంలో ఇన్‌ఛార్జి హోదాలో విజయ వాడ నుంచి మొదటిసారిగా రాజంపేటకు వచ్చిన జగన్మోహన్ రాజుకు ఒంటిమిట్ట, సిద్దవటం నుంచి రాజంపేట వరకు టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ చేప ట్టారు. క్రేన్ల సాయంతో భారీ గజమాలలో సన్మానించారు. అడుగడుగునా బాణాసంచా పేలుస్తూ సంబరాలు జరిపారు. ఈ సందర్భ ంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ తమను సొంత కుటుంబ సభ్యుల్లా ఆదరించి, ఆత్మీయత చూపిం చే చమర్తి జగన్మోహన్ రాజును ఇన్‌ఛార్జిగా నియమించిన సిఎం చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇదే ఉత్సాహంతో రానున్న స్థానిక సంస్థల్లోనూ, సార్వత్రిక ఎన్నికల్లోనూ టిడిపి సత్తా చూపుతామని అన్నారు. చమర్తి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగుర వేయడమే లక్ష్యంగా చమర్తి నేతృత్వంలో పనిచేస్తామని అన్నారు. టిడిపికి పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు.

ప్రజల సహకారంతోనే దోమల నివారణ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మలేరియాను నివారించాలంటే ప్రతి ఒక్కరూ దోమ తెరలను తప్పకుండా ఉపయోగించాలని జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కోనంపేట లక్కిరెడ్డిపల్లి బాలసదనం వసతిగృహం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం జరపాలని వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఇంటి పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని లేకపోతే కొద్దిపాటి నీరు నిల్వ ఉన్న అందులో లార్వా దోమ వల్ల మలేరియా వ్యాప్తి చెందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్త మురికి నీటిని తీసివేయాలన్నారు. మరుగుదొడ్లల్లో తొట్లల్లో ఉన్న నీటిని రెండు రోజులకు ఓసారి శుభ్రం చేయాలన్నారు. అలా చేయకపోతే లార్వా చేరుకుని దోమలు వ్యాప్తి చెందుతాయని అన్నారు. కార్యక్రమంలో మలేరియా సభ్యులు ఆఫీసర్ జయరామయ్య, సిహెచ్‌ఒ రవీంద్ర కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బి.రేఖనాయక్ దేవదానం ఆరోగ్య కార్యకర్తలు ఓబులేసు, రాజేంద్రప్రసాద్, ఎఎన్ఎంలు, ఆశా కారకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


నీటి తొట్టెలను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి


మాట్లాడుతున్న ట్రాఫిక్ సిఐ కుళాయప్ప

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

విద్యార్థి దశ నుంచే విద్యార్థులలో రోడ్డు ప్రమాదాల పట్ల పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండడంతో వారి ప్రాణాలను అలాగే ఎదుటివారి ప్రాణాలను కాపాడగలిగే సామర్థ్యాలు విద్యార్థుల్లో పెంపొందుతాయని రాయ చోటి ట్రాఫిక్ సిఐ కుళాయప్ప అన్నారు. శుక్రవారం పట్టణంలోని చిత్తూరు రోడ్డులో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే విద్యార్థులు కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారు మాత్రమే వాహనాలు నడపాలని డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపినట్లయితే కచ్చితంగా వారు శిక్షార్హులవుతారని హెచ్చరించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపినప్పుడు జరిగే ప్రమాదాలలో ఎక్కువ శాతం యువత మృత్యువాత పడుతున్నారని అన్నారు. అందువల్ల ప్రతి ఒక్క విద్యార్థి వాహనాలను నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్లను ధరించాలని సూచిం చారు. ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు ప్రయాణించటం కూడా నేరమని, అలా ప్రయాణిస్తే కచ్చితంగా వారికి జరిమానాలు విధింపబడతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉపాధ్యాయులు ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ

ప్రజాశక్తి - నందలూరు

ఆల్బెండజోల్ మాత్రలతో పిల్లల్లో నులిపురుగులు నిర్మూలమవుతాయని జిల్లా నోడల్ అధికారి ఇంతియాజ్ పేర్కొన్నారు. మండలంలో నిర్వహించిన ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో 12న, 20న మాపప్ రౌండ్‌లో ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలకు 12205 మందికి ఆల్బెండజోల్ మాత్రలు తినిపించినట్లు తెలిపారు. మండలం లోని అక్షరా స్కూల్, నాగిరెడ్డిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల,అంగన్వాడీ స్కూల్,మండల ప్రజాప రిషత్ పాఠశాలలు పరిశీలించారు. వారితో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటనారాయణ, ఎంఎల్‌హెచ్‌పి ఆరిఫ్, హిమబిందు, సులోచన ఎఎన్ఎం అమృత పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా నోడల్ అధికారి ఇంతియాజ్

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-రామాపురం

మండల వ్యాప్తంగా వినాయక చవితి సందర్భంగా విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని రామాపురం ఎస్ఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27 న వినాయక చవితి సందర్భంగా మండల వ్యాప్తంగా ఉత్సవ కమిటీ సభ్యులు వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. మండపాల వద్ద శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా కమిటీ సభ్యులు బాధ్యత తీసుకోవాలన్నారు. మండపాల వద్ద రాజకీయ పార్టీల పాటలకు అనుమతి లేదని భక్తి పాటలకు మాత్రమే అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ త్వరగా అనుమతులు తీసుకొని ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. నిమజ్జనం చేపట్టే ప్రాంతాలు తేదీలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించి శాంతియుతంగా వినాయక చవితి ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు.

మత పెద్దలతో ఎస్ఐ సమావేశం

ప్రజాశక్తి-ములకలచెరువు

వినాయక చవితి సందర్భంగా శుక్రవారం ఎస్ఐ నరసింహుడు మండలంలోని హిందూ, ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విఘ్నాలు తొలగడానికి ఆటంకాలు జరగకుండా పనులు జరగాలన్న ఉద్దేశంతో నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రతీ ఒక్కరు ఉత్సవాలకు ముందుగా పోలీసుశాఖ నుంచి అనుమతులు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో హిందూ, ముస్లిం సంఘాల పెద్దలు, పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

-రూ.5లక్షలు విలువైన బంగారు నగలు స్వాధీనం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని కడప-చెన్నై రోడ్డులో రెడ్డిపల్లి క్రాస్ వద్ద ఒక వ్యక్తిని అరెస్టు చేసి అతని దగ్గర నుంచి రూ.5లక్షలు విలువైన బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్లు పుల్లంపేట ఎస్ఐశివకుమార్ తెలిపారు. వివరాల్లోకి వెలితే..మండలంలోని కడప-చెన్నై రోడ్డులోని రెడ్డిపల్లి క్రాస్ వద్ద పుల్లారెడ్డిపల్లె గ్రామానికి చెందిన పుట్టబోయిన చరణ్ కుమార్ అనే వ్యక్తి వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి ఒక బంగారం నెక్లెస్, ఒక బంగారు చైను, డాలర్, బంగారు బుట్ట కమ్మలు, చిన్న బంగారు కమ్మలు, బంగారు చెవి చుట్టలు మొత్తం సుమారు 52 గ్రాములు బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని వీటి విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు